## క్లుప్తంగా

### వైభవంగా హనుమంతోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చంద్రశేఖర సిద్ధాంతి

**వర్గల్(గజ్వేల్):** నాచగిరి క్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి హనుమంతోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తజనులు పాల్గొని తరించారు. ఈ సందర్భంగా సంగీత, సాహిత్య కార్యక్రమాలు అలరించాయి. వర్గల్ విద్యా సరస్వతీ క్షేత్ర వ్యవస్థాపకుడు చంద్రశేఖర సిద్ధాంతి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ సుధాకర్ రెడ్డి, మర్పడ్గ సంతాన మల్లికార్జున క్షేత్రం వ్యవస్థాపకుడు హరినాథ్‌శర్మ, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

### మిత్రుడి కుమార్తె వివాహానికి చేయూత



నగదు అందిస్తున్న మిత్రులు

**చేర్యాల(సిద్దిపేట):** పట్టణ కేంద్రానికి చెందిన నిరుపేద యువతి వివాహానికి శనివారం హాజరైన తన తండ్రి కృష్ణ చిన్ననాటి మిత్రులు రూ.20,091ల ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమతో కలిసి చదువుకున్న మిత్రుడు తమ మధ్య లేకపోవడం బాధాకరమని, మిత్రుడి కుటుంబానికి అండగా నిలవాలన్న ఉద్దేశంతోనే నేడు పెళ్లికి హాజరై తమవంతు ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మిత్రులు మురళీ, రఫత్, సత్యనారాయణ, నవజీవన్, నాగరాజు, సత్యం పాల్గొన్నారు.

### ప్రజా సంక్షేమమే లక్ష్యం



చెక్కు అందిస్తున్న నాయకులు

**మర్కూక్(గజ్వేల్):** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాతూరు గ్రామానికి బీఆర్‌ఎస్ కార్యకర్త సత్తయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పార్టీ ప్రమాద బీమా కింద రూ.2లక్షలు మంజూరు కావడంతో శనివారం బాధిత కుటుంబానికి చెక్కు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, సర్పంచ్ అరుణనర్సింలు, నాయకులు మల్లేశం, కృష్ణ, శివారెడ్డి, కనకయ్య, కరుణాకర్ పాల్గొన్నారు.


### వేడుకగా శివపార్వతుల కల్యాణం



కల్యాణానికి తరలివచ్చిన భక్తులు

**నంగునూరు(సిద్దిపేట):** ఖానాపూర్‌లో శివ పంచాయతన నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా శనివారం శివపార్వతుల కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం నవగ్రహ, యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. కల్యాణం అనంతరం మహిళలు అమ్మవారికి ఓడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, సారయ్య, సోమిరెడ్డి, రమేశ్‌గౌడ్, సర్పంచ్ సత్తవ్వ, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.

### కనుల పండువగా మహాచండీయాగం



యాగం నిర్వహిస్తున్న పలువురు దంపతులు

**కొండపాక(గజ్వేల్):** కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామంలో పరమేశ్వర, నందీశ్వర, సంతాన నాగేంద్రస్వామి సమేత నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠోత్సవాల సందర్భంగా నిర్వహించిన మహాచండీయాగం శనివారం కనుల పండువగా సాగింది. ఈ యాగంలో ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రవీందర్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు సద్గుణ, హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భూంరెడ్డి, సర్పంచ్ కనుకవ్వలు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని 60 మంది దంపతులతో వైదిక నిర్వాహకుడు శంకరాచార్యుల మంత్రోచ్ఛారణలతో పాటు ఆలయ అర్చకుడు సాయికుమారాచార్యుడు భక్తిశ్రద్ధలతో నవగ్రహ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమాలను నిర్వహించి పూర్ణాహుతితో ముగించారు.

# వాడీవేడిగా అర్బన్ మండల సమావేశం

**నిధులు లేక ఇబ్బంది పడుతున్నామంటూ సభలో సర్పంచ్‌ల మండిపాటు**



మాట్లాడుతున్న సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కమలాకర్‌రావు

**సిద్దిపేటఅర్బన్:** సిద్దిపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ సవిత అధ్యక్షతన అర్బన్ మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. సభ ప్రారంభం కాగానే గత సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించకపోవడంతో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఈ సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామాల్లో కొత్తగా నిర్మించుకునే ఇంటి నిర్మాణాలకు అనుమతులు టీఎస్‌బీపాస్ ద్వారా కాకుండా మీ సేవా ద్వారా అందించాలని కోరారు. టీఎస్‌బీపాస్‌తో ఎక్కువ డబ్బులు కట్టాల్సి వస్తుందని అదే మీ సేవా ద్వారా తక్కువ ఖర్చు అవుతుందని గుర్తుచేశారు. గ్రామాల్లో నివసించే ప్రజలు ఇంటి నిర్మాణాల అనుమతి కోసం అధికారుల నుంచి సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామకంఠం పరిధిలోని నిర్మాణాల సమస్యలు పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు, కేంద్ర ప్రభుత్వ నిధులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామ పంచాయతీ సఫాయి వర్కర్లకు మూడునెలల నుంచి జీతాలు చెల్లించకపోవడంతో విధుల్లోకి రాకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయిందని వాపోయారు. కనీసం కరెంట్ బిల్లులు కట్టలేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. అంతేకాకుండా కొన్నిరోజుల నుంచి లైన్‌మెన్‌ల కొరత, మిషన్ భగీరథ పైప్‌లైన్ ఇబ్బంది ఉందని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎంపీపీ సవిత ప్రవీణ్‌రెడ్డి, ఎంపీడీవో సమ్మిరెడ్డి సభ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జీడిపల్లి కమలాకర్‌రావు, ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వజ్రోత్సవాల సంబరాలు వాయిదా



మాట్లాడుతున్న వజ్రోత్సవాల కమిటీ కన్వీనర్ లక్ష్మణ్

**హుస్నాబాద్:** పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల స్థాపించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 20న నిర్వహించే వజ్రోత్సవాల సంబరాలను వాయిదా వేస్తున్నట్లు వజ్రోత్సవాల కమిటీ కన్వీనర్ కొండా లక్ష్మణ్ వెల్లడించారు. పూర్వ విద్యార్థులు, పూర్వ ఉపాధ్యాయులతో శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఈ నెల 20న నిర్వహించే వజ్రోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాల్సిన మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అనివార్య కారణాలతో రద్దు అయిందని స్థానిక ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ చెప్పారని తెలిపారు. మంత్రి కేటీఆర్‌తో మరోసారి సమయం తీసుకునేంత వరకు వజ్రోత్సవాల సంబరాలను వాయిదా వేయాలని కమిటీ సభ్యులు తీర్మానించారన్నారు. త్వరలోనే తేదీని ప్రకటించనున్నట్లు లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహణలో భాగంగా 15 మందితో కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్ శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం బండారి మనీల, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, లోక్ అదాలత్ సభ్యుడు చిత్తారి రవీందర్, పందిల్ల శంకర్, కొత్తపల్లి అశోక్, ఎండీ హస్సేన్, అయిలేని శ్రీనివాస్‌రెడ్డి, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, గడిపె మల్లేశ్, కొండా రవీందర్, అజయ్‌కుమార్, రవీందర్‌గౌడ్, వెంకటరమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

**చేర్యాల(సిద్దిపేట):** మండల పరిధిలోని కాశగుడిసెలు గ్రామానికి చెందిన షేక్ షాదుల్లాకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.30వేల చెక్కును శనివారం లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు కేసీఆర్ సేవాదళం మండల అధ్యక్షుడు షేక్ అఖిల్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు షేక్ కమల్, నాయకులు అమరగొండ బాల్‌రాజు, షేక్ ఇమాం, షేక్ సుభాన్, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

**మద్దూరు(హుస్నాబాద్):** దూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన తుషాపురం సాయికి మంజూరైన రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నర్సింహులు, బీఆర్‌ఎస్ పార్టీ దూల్మిట్ట మండల మహిళా అధ్యక్షురాలు అరుణ, మండల ఉపాధ్యక్షుడు ఇమ్మడి సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

### రైతు సంక్షేమానికి కృషి



బ్యాంకు రుణం అందిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటయ్య

**మిరుదొడ్డి(దుబ్బాక):** రైతుల సంక్షేమానికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కృషి చేస్తుందని డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రానికి చెందిన రైతు బోయిన లక్ష్మణ్‌కు పీఏసీఎస్ ద్వారా మంజూరైన రూ.5లక్షల బ్యాంక్ రుణాన్ని శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పీఏసీఎస్ ద్వారా అందిస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

# లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి**



రోడ్డుపై బైఠాయించిన బీజేపీ నాయకులు

**సిద్దిపేటకమాన్:** టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. లీకేజీకి బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సుమారు అరగంట పాటు రోడ్డుపై బైఠాయించడంతో వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం రాస్తారోకో చేస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ 30లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని అన్నారు. పరీక్షలకు హాజరై క్వాలిఫై అయిన వారికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేష్‌గౌడ్, సురేష్, నరేష్, శ్రీనివాస్, అనిల్‌గౌడ్, విద్యాసాగర్‌రెడ్డి, మల్లేశం, అరుణరెడ్డి, పద్మ, సుగుణ, లక్ష్మి పాల్గొన్నారు.

### ఆ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

**గజ్వేల్‌రూరల్:** టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీజేఏసీ జిల్లా కోకన్వీనర్ నీరుడి స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చదువుకున్న నిరుద్యోగ యువత ఏళ్ల తరబడి ప్రభుత్వ ఉద్యోగం కోసం నిరీక్షిస్తున్నారన్నారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో లక్షలాది మంది అయోమయానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పకడ్బందీగా పరీక్షలను నిర్వహించాల్సిన టీఎస్‌పీఎస్సీ నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకుందని, ఇందులో చోటు చేసుకున్న అక్రమాల కారణంగానే పేపర్ లీకేజీ వ్యవహారం బయటకు వచ్చిందన్నారు. ఈ ఘటనకు సీఎం కేసీఆర్ బాధ్యత వహించాలని, పేపర్ లీకేజీకి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు యువతకు నిరుద్యోగ భృతిని చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నోటిఫికేషన్ రద్దుతో నష్టపోయిన నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు టీజేఏసీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామన్నారు.

### ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

**డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి**



మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

**గజ్వేల్‌రూరల్:** పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని డీఈవో శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల్లో సందేహాలను నివృత్తి చేస్తూ పరీక్షలకు సంసిద్ధులను చేయాలని, అన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు లక్ష్మయ్య, ఎంఈవోలు సునిత, ఉదయభాస్కర్, నర్సవ్వలతో పాటు మండల పరిధిలోని ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బొమ్మ వెంకటేశ్వర్లకు నివాళి



నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు

**హుస్నాబాద్:** ఇందుర్తి మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకటేశ్వర్లు 4వ వర్ధంతిని శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. అనంతరం బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, వైఎస్సార్‌టీపీ, స్వచ్ఛంద సంస్థల నాయకులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా బొమ్మ వెంకటేశ్వర్లు ఈ ప్రాంతానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని కోరారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్లు పద్మ, స్వర్ణలత, శ్రీనివాస్, సరోజన, లావణ్య, స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్, వివిధ పార్టీల నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, అన్వర్ పాషా, మల్లేశ్, అశోక్ పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

### ◆ బెజ్జంకి ఎస్ఐగా ప్రవీణ్‌రాజ్



అడిషనల్ డీసీపీ మహేందర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్ఐ ప్రవీణ్‌రాజ్

**బెజ్జంకి(సిద్దిపేట):** బెజ్జంకి ఎస్ఐగా ఎం ప్రవీణ్ రాజ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బెజ్జంకిలో ఎస్ఐగా పనిచేసిన నరేశ్‌రెడ్డి సెలవులపై వెళ్లగా కరీంనగర్‌లో ట్రాఫిక్ పీఎస్‌లో ఉన్న ప్రవీణ్‌రాజ్ బదిలీపై బెజ్జంకి వచ్చారు. శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా చూస్తామని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న బాధితులు నేరుగా పీఎస్‌కు వచ్చి సమస్యలను తెలపాలన్నారు. అనంతరం సిద్దిపేటలో అడిషనల్ డీసీపీ మహేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

### ◆ గురుకుల ప్రవేశాలకు ఈ నెల 20 ఆఖరు

**కొండపాక(గజ్వేల్):** ఈనెల 20వ తేదీలోగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం మీ సేవా లేదా ఆన్‌లైన్ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని కొండపాక సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శిశిధర్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను, విద్యార్థులను కోరారు.

### ◆ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

**దుబ్బాక:** భయాన్ని వీడి ధైర్యంతో ముందుకు సాగితే ప్రతీ రంగంలో విజయం సాధించవచ్చని కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీకగౌడ్ అన్నారు. శనివారం దుబ్బాక పట్టణంలోని కస్తూర్బా పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పరీక్ష సామగ్రిని అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి స్వాతి, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

### ◆ ఆర్థికసాయం

**మిరుదొడ్డి(దుబ్బాక):** మండల కేంద్రమైన మిరుదొడ్డిలో వివిధ కారణాలతో మృతి చెందిన దొందడి రాములు, ఎల్లగౌని అంజయ్య కుటుంబాలను బీఆర్‌ఎస్ నాయకులు శనివారం పరామర్శించారు. ఇరు కుటుంబాలకు 50 కిలోల బియ్యంతో పాటు రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి, మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చందాపురం మల్లేశం, ఉపసర్పంచ్ కనకయ్య, మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ ధర్మారం బాబు ఉన్నారు. కాగా కాంగ్రెస్ నాయకుడు మద్దెల రాజేశ్ దొందడి రాములు కుటుంబాన్ని పరామర్శించి 50కిలోల బియ్యం అందించారు.

# స్కావెంజర్ల బిల్లులను విడుదల చేయాలి

**సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు కళావతి**




కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

**సిద్దిపేటరూరల్:** మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు కళావతి డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో భోజన పథక కార్మికులకు పది నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రాజమణి, లక్ష్మి, స్వరూప, ఐలయ్య, బాలయ్య, నర్సయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

**పశుమిత్రలకు కనీస వేతనం ఇవ్వాలి**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2500ల మంది ఆడపడుచులు 8 సంవత్సరాలుగా మూగజీవాలకు ఉచితంగా పశుమిత్ర కార్మికులుగా వైద్య సేవలు అందిస్తున్నారని వారికి కనీస వేతనం నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు కళావతి సోమవారం డిమాండ్ చేశారు. పశుమిత్రల ద్వారా వెట్టి చాకిరి చేయించుకుంటూ ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం చాలా దుర్మార్గమన్నారు. వీరిని వెంటనే సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం, గుర్తింపు కార్డులు, యూనిఫాం, గ్లౌజులు, మెడికల్ కిట్స్, ప్రయాణ ఖర్చులు, ఎలక్ట్రిక్ బైక్‌లు, మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పశుమిత్ర వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు శారద, జిల్లా కార్యదర్శి లావణ్య, విజయలక్ష్మి, లత, లావణ్య, శ్రీలత, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

### సీసీరోడ్డు పనులు ప్రారంభం



భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

**హుస్నాబాద్:** పట్టణంలోని 2వ వార్డులో రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రజిత మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో సీసీరోడ్లు, మురికి కాల్వల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, దశల వారీగా అన్ని వార్డుల్లో సీసీరోడ్లను పూర్తిచేసి ఆదర్శంగా నిలుపుతామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్ బోజు రమాదేవి, మాజీ ఎంపీపీ వెంకట్, కో-ఆప్షన్ సభ్యుడు శంకర్‌రెడ్డి, అయూబ్, సిబ్బంది పాల్గొన్నారు.

# తొలగిన కరెంట్ స్తంభాల సమస్య



స్తంభాల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

**దుబ్బాక:** దౌల్తాబాద్ మండలం దీపాయంపల్లి గ్రామంలో కొన్ని నెలల నుంచి విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో సంబంధిత సమస్యను దౌల్తాబాద్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి రూ.1.40లక్షల నిధులను మంజూరు చేశారు. దీంతో శనివారం శ్రీనివాస్‌గౌడ్ కరెంట్ స్తంభాల ఏర్పాటు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధే బీఆర్‌ఎస్ లక్ష్యమన్నారు. అలాగే పెద్దమ్మ, మహంకాలమ్మ ఆలయాల సమీపంలో నీటి సమస్య ఉందని సమీపంలో ప్రజలు సమస్య తీర్చాలని కోరగా రూ.1.50లక్షలు జెడ్పీటీసీ నిధుల నుంచి మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, విద్యుత్ అధికారులు, తదితరులు ఉన్నారు.

# మైనార్టీ రుణాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

**దుబ్బాక:** మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో శనివారం దుబ్బాక మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ మనోజ్ రావి, ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ అజయ్‌కుమార్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని రెండు యూనిట్లకు దాదాపు 278 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇంటర్వ్యూలకు 150 మంది హాజరయ్యారు. ప్రభుత్వం మైనార్టీలకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని, దుబ్బాక మున్సిపల్ పరిధిలో ప్రభుత్వం కేవలం రెండు యూనిట్లను మాత్రమే మంజూరు చేయడం దారుణమని మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకున్నవారు అసహనం వ్యక్తం చేశారు.

# దుర్గామాత ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

**చేర్యాల(సిద్దిపేట):** మండల పరిధిలోని ఆకునూరులో వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న దుర్గామాత ఆలయ నిర్మాణ పనులకు శనివారం భూమిపూజ చేశారు. వివిధ కుల సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల సభ్యులందరూ తరలిరాగా వేద పండితులు ఈ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి భూమి ఇచ్చిన బీఆర్‌ఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు వంగాల శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ నిర్మాణానికి తొలి విరాళం రూ.2లక్షలు ప్రకటించిన నాగిల్ల హరికృష్ణశర్మను గ్రామస్తులు సన్మానించారు. అనంతరం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, ఉల్లెంగల సేవా ట్రస్ట్ చైర్మన్ ఉల్లెంగల పద్మఏకానందం దంపతులు దుర్గామాత విగ్రహాన్ని అందించనున్నట్లు ప్రకటించారు. ఆలయ నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, కరెంట్ స్తంభాల ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ మల్లేశంగౌడ్, ఎంపీటీసీ సుధారాణి, ఉపసర్పంచ్ పద్మ, పీఏసీఎస్ డైరెక్టర్ రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు(సిద్దిపేట):** ఐకేపీ సిబ్బందికి ఉద్యోగ భద్రత, పేస్కేల్ అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ ప్రవేశపెట్టినందున చిన్నకోడూరులో ఐకేపీ సిబ్బంది సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం మహిపాల్ మాట్లాడుతూ.. ఐకేపీ సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు శ్రీనివాస్‌రెడ్డి, సేనాపతి, మహిళలు ఉన్నారు.

### పేస్కేల్ ప్రకటనపై హర్షం

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** రాష్ట్రంలోని సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం సిద్దిపేటలోని బీజేఆర్ చౌరస్తాలో సెర్ప్ జేఏసీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సెర్ప్ ఉద్యోగులు కరుణాకర్‌రావు, వాసుదేవ్, ఆంజనేయులు, శ్రీనివాస్, మైపాల్, చంద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కొమురయ్య, నర్సయ్య, ధర్మసాగర్, రాజయ్య, విజయనిర్మల, కవిత తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయల తైబజార్ వేలం రద్దు



తైబజార్ వేలంలో చైర్‌పర్సన్ వనిత, కమిషనర్ గణేశ్‌రెడ్డి

**దుబ్బాకటౌన్:** దుబ్బాక పట్టణంలో కూరగాయల తైబజార్‌తో పాటు శనివారం జరిగే సంత కోసం నిర్వహించిన తైబజార్ వేలం పాటను రద్దు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అధ్యక్షతన కూరగాయల సంతతో పాటు ప్రతిరోజు కూరగాయల మార్కెట్‌కు గాను తైబజార్ వేలం పాటను నిర్వహించారు. ఈ సందర్భంగా వేలం పాటలో గతంలో రూ.15లక్షలు ఉంటే ఈ సారి అంతకంటే వేలంలో తక్కువ పాడడంతో నిబంధనల ప్రకారం రద్దు చేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. ఇదివరకు సైతం తక్కువగా పాడడంతో రద్దు చేయగా మళ్లీ ఈ రోజు అదే పరిస్థితి ఏర్పడింది. తిరిగి త్వరలోనే తైబజార్ వేలం పాట తేదీని ప్రకటిస్తామన్నారు. వేలం పాటలో తైబజారును దక్కించుకునేందుకు కనీసం రూ.15లక్షల కంటే ఎక్కువగా పాడాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో నిబంధనలకు విరుద్ధంగా తైబజార్ వేలం ఇవ్వమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.